
# అత్తగారి హనీమూన్

బద్దిగం అరుణశ్రీ



**అసలీ వేసవి కాలం వచ్చిందంటే ఐస్ క్రీములు, హనీమూన్‌లు, ఫ్రిజిడేర్లు, సీలింగు ఫాన్లు, వట్టి వేళ్ళ తడికలు, చివరకు తాటాకు విసన కర్రలు, కొత్త కుండలు, తెల్ల తెల్లని మల్లె పూలు, వారి వారి అంతస్తుల్ని బట్టి అత్యవసరంగా కనబడుతూ ఉంటాయ్**

కొత్త కొత్త జంటలు, విడదీస్తున్న (గ్రీష్మ తాపానికి విసుక్కుంటూ) కొద్ది కొద్దిగా పాత బడుతున్న జంటలు, పూర్తిగా ముసలి దంపతులు, బాగా డబ్బున్న వాళ్ళు, ఓ మాదిరి డబ్బు గల వాళ్ళు (సారీ, అసలు నిరుపేదల సంగతి వదిలేద్దాం), వాళ్ల వాళ్ల స్తోమతను బట్టి, ఊటీ, కాశ్మీరు, హైద్రాబాద్, బెంగుళూరు ల్లాంటి నగరాలకు, లేదా చుట్టా లిళ్లకు (వాళ్ల ప్రాణాలు తియ్యడానికి) హనీమూన్‌కు బయల్దే రుతూ ఉంటారు. అదే బస్సుల్లో, రైళ్లల్లోనూ, రకరకాలుగా వాళ్ల నోటును బట్టి బట్ట కత్తిరి స్తూ ఉంటారు.

ఎప్పుడూ లేంది ఆ ఏడు, మాకున్న ముగ్గురు సంతును ఎక్కడికైనా తగిలేసి, (అదే లెండి, తాత గారింటికో, పిన్ని గారింటికో) నేనూ, మా శ్రీవారూ విమానంలో ఇంచక్కా మద్రాసు గానీ, ముంబయి గానీ, మరో బెంగుళూరు గానీ, ఇంకో ఆగ్రా గానీ (ఎన్నాళ్లుగానో కూడబెట్టుకున్న డబ్బుతో) పిల్లలకు తెలియకుండా ప్లాను వేసుకున్నాం. 'పిల్లలకు తెలిస్తే ఇంకే ముంది? పిల్ల లంటే పిశాచాలు కదుటండీ!)

సరే, మర్నాడు మా వారు, వాళ్ల ప్రయాణానికి బస్సు టిక్కట్లు, ఆ మర్నాడు మా ప్రయాణానికి ప్లైట్ టిక్కట్ల రిజర్వేషన్ కోసం వెళ్లారు.

హు! ఇంకే ముంది? ఆశ్చర్యం! ఇంచక్కా మా అత్త గార్ని వెంట బెట్టుకొచ్చారు బస్ స్టాండ్ నుంచి. చెప్పద్దూ? నాకు ఒళ్లు మండి పోయింది. ఇంకేం హనీమూన్? ప్లానంతా అప్సెట్!

"ఏమిటో ఈ మధ్య బొత్తిగా లేవ లేక పోతున్నాననుకో. ఏళ్ల తరబడి ఆ వంటిల్లు, ఆ చాకిరీ ... అలా కూరుకు పోవటమే కదా! ఇంకేం ఓపిక ఉంటుంది? అదే స్వర్గం, మోక్షం అనుకుందామంటే ఇంకా ఎంత కాలం? ఓర్పు చచ్చి పోతూందనుకో! అందుకేనే అమ్మాయ్, కాస్త నాలుగు రోజులు విశ్రాంతిగా ఉండి ఓపిక తెచ్చుకోవా లనిపించింది. పిల్ల లందర్నీ అక్కడా, ఇక్కడా సర్ది ఇంటికి తాళం పెట్టి ఇలా చక్కా వచ్చాం. ఏమిటో, ఆ రోజుల్లో పద్ధతులా, పాడా! ఎంత మందినైనా అలా కంటూ పడి ఉండటమే. ఇంచక్కా, మీలా ఇద్దర్నీ, ముగ్గుర్నీ కంటే ఎంత ఓపికైనా ఉండేది' ' అడుగు పెడుతూనే ప్రవాహంలా చెప్పుకు పోతుంటే (నేనేమయినా అనుకుంటానేమో అని) ఓ వైపు ఒళ్లు మండి పోతున్నా, మరో వైపు జాలి కలిగింది. ఆ వయసులో ఆవిడ ఆశ తప్పు కాదనిపించటంతో, ఊ కొట్టడం కంటె ఏం చెయ్యలేకపోయాను. పోనీ, మనకు కావలసినట్లు మనం లేక పోయినా, వాళ్లు కోరుకున్నట్లు వాళ్లను ఆదరించటం కనీస ధర్మం అనిపించింది.

ఆ రాత్రి ధుమధుమలతో, చిటపట లాడుతున్న నన్ను ప్రసన్నం చేసుకోవాలని మా శ్రీవారు "పోన్లే డార్లింగ్! మన హనీమూన్ మరో సారి'' అంటూ తెల్లని మల్లెలు ఆఘ్రాణిస్తూ దగ్గరికి తీసుకున్నారు. 'ఇంత కంటె వేరే హనీమూన్ ఎక్కడుంది? ప్రశాంతత, చల్లదనం మనసులో ఉండాలి గానీ, ఈ ఏటి కిది చాలు' అనుకుంటూ ఆ గుండెల్లో ఒదిగి కరిగి పోతూంటే ...'మరీ అంత [illegible]రవశ్యం

పనికి రాదు, నన్ను గమనించకుండా' అన్న అసూయతో నల్లగా మెరుస్తున్న టెలిఫోను, గట్టిగా అరవటం మొదలెట్టింది. అలాగే మరో చేత్తో రిసీవ రందుకున్నారు మా వారు (మంచం పక్కనే లెండి). హు! ఎవరో కాదు, పాపం, మా ఎదురింటాయన సినిమా కెళ్లి ఒంటి గంట కొస్తాడ ట. అందుకని భార్యామణికి ... అర్ధ రాత్రి పదింటికి వెళ్లి చెప్పి రావాలట. "ఛీ ఛీ! బొత్తిగా కామన్ సెన్స్ లేని మనుషులు. ఏ వస్తువు ఎలా వాడుకోవాలో, ఎవరితో ఎలా మెలగాలో తెలియని మూర్ఖులు" అని టకామని మా వారు రిసీవరు పెట్టేసి మళ్లీ నన్ను దగ్గరికి తీసుకున్నారు అధరాలను అందుకుంటూ.

"అమ్మాయోయ్! తల వగిలి పోతోందికానీ, కాస్త అమృతాంజనం ఇచ్చి వెడుదూ" బయట్నుంచి అత్త గారి పిలుపు. వెలికి ఆవిడ కదిచ్చి తలుపేసుకోబోయాను.

"అమ్మా! మంచి నీళ్లు" నాలుగేళ్ల పాప.

"నాకూ కావాలే!" ఆరేళ్ల బాబు.

"నేను నీ దగ్గరే పడుకుంటా!" కూడా వచ్చేసింది పాప.

ఛీ ఛీ! ఇంకే ముంది? విసుక్కుంటూ వెళ్లేసరికి శ్రీవారు గుర్రు పెట్టి నిద్ర పోతున్నారు. తప్పదన్నట్లు పాపను జో కొడుతున్నట్లు బాది మెల్లిగా కళ్లు మూసుకున్నాను.

✹ ✹ ✹

సరే, రోజుకో చోటు చొప్పున ఇద్దరికీ అన్ని ప్రదేశాలూ చూపించాలని ఆ రోజు ఆరింటికల్లా అందరం కలిసి టాంక్ బండ్‌కు చేరుకున్నాం. చల్లగా గాలి వీస్తుంటే ఖాళీగా ఉన్న బెంచీ వెతుక్కుని కూచున్నాం. అప్పుడప్పుడే చిక్కబడుతోంది టాంక్ బండ్ మనుష్యులతో, లైట్లతో.

"ఎందుకురా అబ్బాయ్! పెట్రోల్ తగలేసుకుని ఇక్కడికి రావటం? హాయిగా మన ఊళ్లో కాలవ గట్టు మీద ఇంత కంటె చల్లగా ఉంటుంది. ఈ పాటి అక్కడ లేదూ? ఏదో నాలుగు రోజు లుండి పోదామని గానీ, ఇవన్నీ తిరగాలనా?" అన్నారు మా అత్త గారు బెట్టుగా, మళ్లీ కొడుకు డబ్బులు ఖర్చవుతున్నాయన్న బాధతో.

"బామ్మా! ఇది కాలవ గట్టు కాదు. అయినా మీ కాలవ గట్టు మీద స్నానాలూ, అవీ చేస్తారు గానీ ఇంత బాగా ఎందుకుంటుంది?" మా పదేళ్ల పెద్ద బాబు వాదానికి దిగాడు బామ్మతో.

ఇంతలో అక్కడ ఐస్ క్రీమ్ బండి కనబడగానే, (ముఖ్యంగా) పిల్లలు ముగ్గురికీ దాహం వెయ్యటం మొదలు పెట్టింది. తెలిసిన దాహమే కనుక ఆలస్యం చెయ్యకుండా అందరికీ తీసుకున్నారు. మా అత్త గారికి (మనసులో తినాలనున్నా) అక్కడ అలా తినటం (అందరి ముందూ) సిగ్గనిపించింది. పైగా ఆ చల్లదనానికి పళ్లు లాగేస్తాయని భయమూ వేసింది. పాపం! అలవాటు కూడా లేదు. పూర్వ కాలపు మనిషి. నలుగుర్లో సోషల్‌గా తిరగటం తెలియదు. తిరిగే వాళ్లంటే గిట్టదు. అందుకే మా ఇద్దరికీ కాస్త చిటపట కూడాను. (ఉష్! మనలో మన మాట. ఆవిడకు వినపడుతుందిస్మండీ!) ఆవిడ కూతుళ్లను కూడా అలాగే పెంచారు. అందుకే నా ఫ్యాషన్లు, నా సరదాలు వాళ్లెవరికీ అంతగా నచ్చవ్! అఫ్‌కోర్స్, మా వారికి తప్ప. సరే అసలు పాయింటు వదిలేసి, అత్త గారు గుర్తొస్తే కోడళ్లు మాత్రం తక్కువా?

ఇంతకీ అత్త గారు ఐస్ క్రీమ్ తినను గాక తిననన్నారు. ఓ గ్లాసుడు మంచి నీళ్లు మాత్రం కావాలన్నారు.

"ఇక్కడ మంచి నీళ్లెక్కడ దొరుకుతాయ్? పోనీ సోడా తాగుతావా? కూల్ డ్రింక్ అయినా సరే."


"అదేమిట్రా? ఎదురుగుండా అన్ని నీళ్లుంటేను! ఇక్క డెక్కడైనా రేవు ఉందేమో చెప్పు. చక్కగా దిగి వెళ్లి తాగి వస్తాను. అసలు ఓ మర చెంబు తెచ్చుకు నుంటే ముంచుకుని తాగొచ్చు."

"అబ్బబ్బ! ఊరుకో అమ్మా! ఇది మన ఊరు కాదు" అన్నారు మావారు నామర్దాగా ఓ కుర్రాడికి కోకాకోలా ఆర్డ రిచ్చి.

"రేపయినా సుబ్బరంగా మర చెంబు నిండా మంచి నీళ్లు తెచ్చుకోవాలి గానీ నాతో పేచీ పనికి రాదురా అబ్బాయ్!" కొడుకును కసురుకున్నారు. (ఓ, అయితే రేపు కూడా బయటికి వెళ్లాలన్న ప్లాను అత్తగారు ముందుగానే వేసుకున్నారన్నమాట! - అనుకున్నాను మనస్సులో).

'ఒరేయ్ ... ఈ పుల్లతో ఇదెల్లా తాగాలిరా? ఊహూ ... నా వల్ల కాదు. ఇదుగో కుర్రాడా! మీ కొట్లో కెళ్లి ఆ కోమటి నడిగి ఓ గ్లాసు తెచ్చిపెట్టు' హెచ్చరించారు తనే.

పాపం! బామ్మ గారి మాట కాదన లేక చిన్నగా నవ్వుకుంటూ అచ్చ తెలుగు అంతగా అర్థం కాని కుర్రాడు, ఓ పెద్ద బీర్ గ్లాసు తెచ్చి ఇచ్చాడు. దాన్ని అటూ ఇటూ, ఇటూ అటూ ఆ లైట్ల వెలుగులో పరీక్షగా చూసి, "నా కళ్లకి సరిగా ఆనటల్లేదు గానీ, ఇంత పల్చగా, ఇంత పెద్దగా ఉందేమిట్రా? ఏ సారా తాగిందేనా కాదు కదా? ఉహు ..." వాసన చూసుకుంటూ తప్ప దన్నట్లు అందులోనే పోసుకుని తాగేశారు. "ప్చ్! డబ్బు తగ లెయ్యటం తప్పిస్తే ఇక్కడ చూసేందు కేముంది? చక్కగా ఒంటి నిండా పట్టు చీర కట్టుకుని తల నిండా ఇన్ని పూలు పెట్టుకోటం తెలీక, సిగ్గు లేకుండా, ఆడో, మగో అసల్లే తెలీకుండా, బరి తెగించి బట్టలు కట్టుకున్న ఈ ఆడా, మగా కాని మనుష్యుల్ని చూడటానికి ఇంత దూరం ఎందుకో రావటం? మన ఊళ్లో కాలవ గట్టు మీద దొమ్మరాళ్లు గుడిసెలు వేసుకుని వ్యాపారం చేస్తూ ఉంటారు. చూడ్డానికి అదే మంచి కాలక్షేపంగానూ. తమాషాగానూ ఉంటుంది" అన్నారు ఏవగింపుగా, ఆ రెండింటికీ ఏమీ తేడా కనపడనట్లు. రకరకాల మనుష్యులు, ఆ వేషభాషలు ఆవిడకు నచ్చలేదు. అసలు నచ్చేలాంటి అభిరుచి లేదు. అందుకే ఏ విలువలు ఎంతో వెల కట్టలేక పోయారు. కానీ ఆవిడకు తెలియని ప్రపంచం చాలా ఉందన్న సంగతి ఆవిడ తెలుసుకోగలుగుతున్నారని నాకు సంతోషం కలిగింది.



"ఈ షోకులు, ఈ మనుష్యుల కోసం అయితేనే ఈ కాలవ గట్టుకు రావాలి. లేక పోతే ఎందుకు చెప్పు! ప్చ్! నాకేం నచ్చ లేదు. పోదాం పదండి" అంటూ లేచారు దర్జాగా.

"హైద్రాబాద్ చూద్దాము అని అక్కడ నస పెట్టేశావ్! తీరా వచ్చాక వాడేదో చూపిస్తుంటే చూడక మళ్లా ఇదొక నస!" సహజంగా విసుక్కున్నారు మావ గారు.

అనుకోకుండా కొత్త కొత్త విషయాలు తెలుస్తున్నందుకు ఆశ్చర్యం ... వా ళ్లంత అమాయకంగా బయట పడుతున్నందుకు జాలీ కలిగాయ్. అయితే ఆవిణ్ణి చూడ వలసిన ప్రదేశాలకే తీసుకెళ్లాలి అని దృఢంగా అనుకున్నాను.

మా హనీమూన్‌కని పెట్టుకున్న సెలవు ఉందిగా! ఇక మర్నాడు పది గంటలకల్లా జూలాజికల్ పార్క్‌కు బయల్దేరాము. (మా వారి పితృ భక్తికి మెచ్చుకుంటూ) పానకం బిందె సైజులో ఉన్న కంచు మరచెంబు నిండా (అది ఆవిడ కాపురానికొచ్చే నాడు పుట్టింటి నుంచి తెచ్చుకున్నారు లెండి) మంచి నీరు పోశారు. మనవలకు, తనకు సరిపడేలా టిఫిన్ కూడా కాస్త స్టీల్ డబ్బా నిండా (అదే పెద్ద సైజు డబ్బా) పెట్టుకుని కార్లో మడిగా ఓ మూల పెట్టుకున్నారు. (మిగతావన్నీ డిక్కీలో పెట్టాం లెండి). మా చిన్న వాడు కారు పార్కుకు చేరే లోపల, అందుబాటులో ఉన్న ఆ డబ్బా లోంచి ఎవరూ చూడకుండా తీసుకుని తినటం మొదలు పెట్టే సరికి ... సగానికి పైగా అయి పోయింది. పాపం! అత్తగారికి ఆ రోజు టిఫిను లేదు. దగ్గర్లో పళ్లు కూడా దొరక్క పోవటంతో మళ్లీ కోకా కోలా తాగక తప్ప లేదు. ఈ సారి నిజంగానే అది ఏ కల్లో, సారానో అన్న అనుమానంతో ... బలవంతంగా తాగారు.

పార్కంతా నడవ లేకపోయారన్న మాటే గాని చూసి మాత్రం చాలా సంతోషించారు. మొత్తానికి ఇంత పార్కును ఎవడు కట్టించాడో కానీ, చాలా బాగుంది అని మెచ్చుకున్నారు.

అట్లాగే నౌబత్ పహాడ్‌కు తీసుకు వెడితే ఆవిడకు నచ్చ లేదు. 'ఏమిట్రా, మనూళ్లో నూకాలమ్మ గుడికి (ఇల్లాగే) మెట్లెక్కి వెళ్లి నట్లు!' అని విసుక్కున్నారు. అటు పై నుంచి పళ్లు, పాల లాంటివి మడిగా, పిల్లలు చూడకుండా కార్లో ముందర సీట్లో కొడుకు దగ్గర పెట్టుకునే వారు. ఆ తర్వాత మ్యూజియం, గార్డెన్, చార్‌మినార్ లాంటి వన్నీ వరుసగా చూపించేశాం.

''ఇవన్నీ చాలా బాగున్నాయిరా, సినిమాలోలాగ. ఆ మేడ (అదే చార్ మినార్) అంత ఎత్తుగా ఎవరు కట్టించారో గాని ఎంత బాగుందో! అన్నన్ని రకాలు వింతలు ఎన్ని గదుల్లో ఎంత బాగున్నాయో! వీ టన్నిటికీ ఎన్ని డబ్బులు ఖర్చయి ఉంటా యంటావ్?' ' అంటూ ఆశ్చర్యంగా, వింతగా, ఇం కెవరూ వినకుండా (వినటల్లే దనుకున్నాక) కొడుకును మాత్రమే అడిగి తెలుసుకున్నారు. పాపం! ఓర్పుగా అన్నిటికీ, జవాబులు ఆవిడకు నచ్చేలా చెప్తున్న శ్రీవారిని ఏడిపించటం నాకు సరదాగా ఉండేది.

"అమ్మాయోయ్! మీ రెప్పుడూ ఇక్కడే ఉంటారు కదా! ఇంచక్కా రోజూ చూస్తారా?' '

"లేదు బామ్మా! మేం పేచీ పెడితే నాన్న ఎప్పుడో గానీ తీసుకెళ్లరు. అయినా చూసినవేగా! మాకు విసుగే" అన్నారు పిల్లలు. వాళ్లు ఊరు వెళ్ల లేదన్న చిరాకుతో.

"అయితే నేను మళ్లీ వస్తానుగా. అప్పుడివన్నీ మళ్లీ చూద్దాం. అంత వరకు నాన్నను అడగకండి. ఇదివరకంటే హైద్రాబాదు ఎంతో దూరంగా అనిపించేది. ఇప్పు డిక్కడ మీ నాన్న ఇల్లు కట్టాక మనకు దొడ్డి గుమ్మంలా ఉంది హైద్రాబా దంటేను.. ఎంత సేపు, మళ్లీ ఇట్టే వస్తాను. ఏం? మీకు వచ్చేటప్పుడు అరిసెలు, లడ్డూలు అన్నీ తెస్తాను. ఇంచక్కా అప్పు డన్నీ చూద్దాం" పిల్లలకు నచ్చ జెప్పారు.

కారు అలసి పోతున్నందుకు మా వారి మనసు రెపరెప లాడినా (సారీ! కారంటే మాటలా మరి? ఉంచుకున్న ప్రియురాలి లాంటిది. అంచేత దాన్ని కష్టపెట్టలేరు) మొత్తానికి ఒకటీ, అరా తగులూ, మిగులూ అన్నీ అత్త గారికి, మావ గారికీ చూపించేసి ఓ ఇరవై రోజుల్లో హనీమూన్ అయిం దనిపించేశారు. అన్నీ చూసేశాక విసుగొచ్చిన అత్త గారికి ఇంటి మీద, పిల్లల మీద భ్రమ కలగటంతో వెళ్లిపోవాలని తొందర పడే సరికి, ఆ సుఖాలను చూసిన కొడుకును ఆప్యాయంగా దీవించి తృప్తిగా ఇద్దరూ వెళ్లి పోయారు.

ప్లానంతా పాడై హనీమూన్ వాయిదా పడినందుకూ, అనుకోకుండా అత్తగారు హనీమూన్‌కు వచ్చి సుఖపడి వెళ్లినందుకూ ఉక్రోషంతో, నా మాట నెగ్గించ లేదని మా వారి మీద కోపంతో "అవున్లెండి! నా కంటె మీకు మీ అమ్మే ఎక్కువ. ఆవిడతో కూడా వెళ్లలేక పోయారా?'' అంటూ రుసరుసలాడుతూ ఆ రాత్రి కూడా శ్రీవారికి దూరంగా జరిగాను. ఈ సారి నిజంగానే రిసీవర్ని పగలగొడ్తానుకుందేమో, ... పిచ్చిది ఫోను ... కిక్కురు మన్లేదు ... (ఏ పక్కింటాయనా రింగ్ చెయ్యనందుకు మెచ్చుకుంటూ) ప్రసన్నం చేసుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్న శ్రీవార్ని చూసి ఓ వైపు కరగాలని ఉన్నా, మరో వైపు బిగుసుకు పోతున్నాను. తమ కొడుకు ఇబ్బంది పడుతున్నాడని తెలియని అత్తమామలు రైల్లో హాయిగానే ఉండి ఉంటారు.

✹ ✹ ✹

"అయినా ఈ కోడళ్లకు ఎంత సేపూ అత్తల మీదే కళ్లు! ఈ కాలపు కోడళ్లు మరీ బరి తెగించి పోయారు. వెర్రి వెధవలు కాక పోతే మన కొడుకులు ఇలా వాళ్ల కొంగట్టుకుని కాళ్లా వేళ్లా బడతారా? తల్లుల్ని ఆడి పోస్తుంటే ఊరుకుంటారా?" అంటూ బాధ పడి పోతున్న అత్త గార్లకు చిన్న మనవి. చూడండీ! కోడళ్లు రాయక పోతే కూతుళ్లు రాస్తారా చెప్పండి! అత్తాకోడళ్లంటేనే అందరికీ కాలక్షేపం. ఔనంటారా, కాదంటారా?

Ⓟ

